సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 24 । జనవరి । 2023



గోపన్నపై నిర్లక్ష్యమేలా!

భద్రాచల రామాలయం నిర్మాత, పరమ భక్తాగ్రేసరుడు భక్త రామదాసు మందిరం నిరాదరణకు గురవుతోంది. 8లో



ఎస్సీ యువతను ఆదుకోండి..

స్వయం ఉపాధి కల్పించాలని నిరుద్యోగ యువకులు ఎస్సీ కార్పొరేషన్ అధికారులను కోరుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం 33°/17°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రత సాధారణంగానే ఉంటుంది. రాత్రి వేళలో చలి ప్రభావం ఉండవచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి సేవ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం గావించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

సంపద కొల్లగొడుతున్న పాలకులు



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

చండ్రుగొండ : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజాసంపదను కొల్లగొడుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు వంకాయలపాటి శ్రీనివాసరావు సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాటాల ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల పార్టీ కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, టీజేఎస్ రాష్ట్ర నాయకులు తాళ్ళూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, నాగా సీతారాములు, టీఆర్‌ఎస్, టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు స్తూపం ఆవిష్కరణ

చండ్రుగొండలోని బొడ్రాయి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీనివాసరావు స్మారక స్తూపాన్ని పోతినేని సుదర్శన్ ఆవిష్కరించారు. శ్రీనివాసరావు పార్టీ కోసం, పేద ప్రజల కోసం నిత్యం శ్రమించాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐలూరి రామిరెడ్డి, కొండపల్లి శ్రీధర్, యాస నరేష్, పెద్దిని వేణు, ఆర్ వెంకటాచారి, విప్పర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- 91 మంది అభ్యర్థులు.. రెండేసి సెషన్లలో పరీక్ష



కొత్తగూడెం అర్బన్: జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ మొదటి విడత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పరీక్షలు 24, 25, 28, 29, 30, 31వ తేదీలతో పాటు ఫిబ్రవరి 1వ తేదీన జరగనున్నాయి. జిల్లాలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా, 91 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం పరీక్ష 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్ష 3నుంచి సాయంత్రం 6గంటల వరకు జరుగుతుంది. కాగా, ఉదయం పరీక్షకు 8–30 గంటల్లోగా, మధ్యాహ్నం పరీక్షకు 2–30గంటల వరకు మాత్రమే విద్యార్థులను అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ట్రాన్స్‌పరెంట్ పెన్ను, అడ్మిట్ కార్డు, పాస్‌పోర్టు/ఆధార్‌కార్డు /రేషన్ కార్డుల్లో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు తప్పక మాస్క్ ధరించి రావాలని, అభ్యర్థులు వారికి కేటాయించిన సమయంలో కేంద్రాలకు చేరుకోవాలని వివరించారు

నూతన భవనంలోకి డీసీఎంఎస్ కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం త్రీటౌన్‌లో కొనసాగుతున్న జిల్లా సహకార మార్కెటింగ్(డీసీఎంఎస్) శాఖ కార్యాలయాన్ని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ రోడ్‌లో ఉన్న ఆర్ అండ్ బీ కార్యాలయంలోకి మార్చారు. ఈ భవనంలో చేపట్టిన మరమ్మతులు పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. త్వరలోనే నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు డీసీఎంఎస్ చైర్మన్ వెంకటశేషగిరిరావు తెలిపారు.

ఏ గూటి పక్షి ఆ గూటికే..



సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి, పక్కన కనకయ్య, విజయ్‌బాబు తదితరులు

- తుదిశ్వాస వరకు జనం కోసమే ఉంటా
- నా అనుయాయులను ఇబ్బంది పెడితే ఉపేక్షించం
- 2014 నుంచీ హామీలకే పరిమితమవుతున్న పోడు సమస్య
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి



సభకు హాజరైన పొంగులేటి, కోరం అనుచరులు

ఇల్లెందురూరల్: భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించకముందే తాను నిర్వహించే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు రాకుండా కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. చివరకు ఏ గూటి చిలక ఆ గూటికే చేరుతుంద(మనతో రావాల్సిన వారు వచ్చి తీరుతారు)నే సామెతను తాత్కాలికంగా అడ్డుకునే వారు మరిచిపోవద్దని హితవు పలికారు. పొంగులేటి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఇల్లెందు నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని మండలంలోని లలితాపురం గ్రామశివారులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని, అనతికాలంలో ప్రజలు ఆశీర్వదించి ఎంపీని చేశారని గుర్తుచేశారు. కానీ తరువాతి కాలంలో రాజకీయ క్రీడలో పదవిని కోల్పోయానే తప్ప ప్రజాభిమానాన్ని పదింతలు సంపాదించుకున్నానని అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రజల ఆశీర్వాదంతో తొలిసారిగా 2014లో ఎన్నికల బరిలోకి వచ్చానని, ఫలితాలు రాకముందే తమకు మద్దతునివ్వాలని ఒత్తిడి చేశారని గుర్తుచేశారు. రెండున్నరేళ్ల తర్వాత ప్రజామోదంతో టీఆర్‌ఎస్(ప్రస్తుతం బీఆర్‌ఎస్)లో చేరామని వివరించారు. ఆ తరువాత తనకు, తన అనుయాయులకు పదవులు ఇవ్వకుండా బుజ్జగింపులతో కాలయాపన చేశారని ఆరోపించారు. 2018 ఎన్నికల్లో జిల్లా నుంచి టీఆర్‌ఎస్ తరఫున ఒక్కరే గెలిచారని, ఈ క్రమంలో రాజకీయ కురువృద్ధ నేతలు, లాబీయింగ్ చేసే నేతల చెప్పుడు మాటలు నమ్మి రాత్రికి రాత్రే వేరే పార్టీలో నుంచి చేర్చుకొని ఖమ్మం పార్లమెంటు సీటును కట్టబెట్టారని విమర్శించారు. ఆ సమయంలో తనను ఇండిపెండెంట్‌గా బరిలో నిలవాలని అభిమానులు ఒత్తిడి చేసినా కేటీఆర్ ఇచ్చిన హామీ, విలువలకు కట్టుబడిన వ్యక్తిగా తాను ఆ ప్రయత్నం చేయలేదన్నారు. తాను పార్టీలో చేరినసమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కటీ అమలు చేయలేదన్నారు. నాటినుంచి పదవి లేకున్నా ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారిని ఓదార్చే ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు.

పోడుపై హామీలతోనే సరి

దివంగత నేత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు పోడుభూములకు పట్టాలిచ్చారని, ఎన్టీఆర్ రూ.2కు కిలో బియ్యం ఇచ్చి జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తుచేశారు. కానీ పోడు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామంటూ 2014 నుంచి హామీలు ఇస్తున్నారే తప్ప నేటికీ పరిష్కరించడం లేదన్నారు. విలువలకు, విశ్వసనీయతకు అంత తేడా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండేది కేవలం మూడు నెలలేనని, ఈ మూడు నెలలపాటు తమ అనుయాయులను అధికారమదంతో ఇబ్బంది పెట్టినా, పోలీసు బలాన్ని ప్రయోగించినా ఊరుకోబోనని, గాంధేయ మార్గంలో దీక్ష చేసి ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు.

అవమానం.. అవహేళనల వల్లే ఆత్మీయ సమ్మేళనాలు..

గడిచిన నాలుగేళ్లగా జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీలో కొందరు నాయకులు, కార్యకర్తలకు పద్ధ అవమానాలు, అవహేళనల వల్లే నేడు ప్రజాభిప్రాయం కోరుతూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాల్సి వస్తోందని డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్లు తుళ్లూరి బ్రహ్మయ్య, మేకల మల్లిబాబుయాదవ్ అభిప్రాయపడ్డారు. గతంలో జిల్లా స్థాయిలో నాయకత్వం వహించిన వారిని నేడు పలకరించే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలకు దిక్కులేకుండా పోయిందని, కార్యకర్తలు కూడా ఏ గట్టున ఉంటారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి రాకుండా అడ్డుకునేందుకు కొందరు చేయని ప్రయత్నం లేదని ఆరోపించారు. పోటీగా మరొక ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం వారి అభద్రతకు నిదర్శనమన్నారు. ఏ శక్తులు అడ్డొచ్చినా పొంగులేటి బాటలోనే పయనిస్తామని స్పష్టం చేశారు. సభలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ, ఎంపీపీ చౌహాన్, నాయకులు కోరం సురేందర్, మండల రాము, సూర్నపాక సత్యనారాయణ, గుండా వెంకటరెడ్డి, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, ముక్తి కృష్ణ, భూక్య నాగేశ్వరరావు, మధురెడ్డి, రెంటాల బుచ్చిరెడ్డి, పత్తి స్వప్న, సంకు సత్తిరెడ్డి, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, తాటి భిక్షం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యుద్ధానికి సిద్ధం కండి

పొంగులేటి నాయకత్వంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల యుద్ధానికి కార్యకర్తలు సిద్ధం కావాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పిలుపునిచ్చారు. గతంలో ఎమ్మెల్యేగా తన పరిపాలన, ప్రస్తుత ఎమ్మెల్యే పరిపాలన బేరీజు వేసుకోవాలని శ్రేణులకు సూచించారు. తనను నమ్ముకున్న వారికి నాలుగేళ్లుగా అవమానాలు, బెదిరింపులు, పోలీసు కేసులు, వేధింపులు తప్పడం లేదని, అందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. పొంగులేటి భవిష్యత్ రాజకీయాలపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నా ఇల్లెందు నియోజకవర్గ ప్రజలు దానిని సమ్మతిస్తారని స్పష్టం చేశారు.

కుంపటి రగిలిస్తున్నారు..



మాట్లాడుతున్న ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, పక్కన దిండిగాల, డీవీ తదితరులు

- బీఆర్‌ఎస్ ఎవరికీ అన్యాయం చేయలేదు..
- పార్టీ వీడిన వారికి ప్రజా క్షేత్రంలో గుణపాఠం తప్పదు
- మున్సిపల్ సమ్మేళనంలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ



సమ్మేళనానికి హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు

ఇల్లెందు: 'బీఆర్‌ఎస్ ఏనాడూ ఎవరికీ అన్యాయం చేయలేదు. అభివృద్ధి కోసం ఎక్కడెక్కడో ఉన్న వారంతా బీఆర్‌ఎస్ గూటికి చేరాం. ఈనాడు కొందరు స్వార్థంతో వెళ్తున్నారు.'అని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ పేర్కొన్నారు. మున్సిపల్ పాలకవర్గం మూడేళ్ల పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో సోమవారం ఇల్లెందులోని బీట్ మార్కెట్‌లో పట్టణ ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2018లో ఉమ్మడి జిల్లాలో 10 సీట్లు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతిలో పెడితే తొమ్మిది సీట్లు ఓడిపోయేలా చేశారని, ఈనాడు మాయమాటలతో 10 సీట్లలో కుంపటి రగిలిస్తున్నారని ఆరోపించారు. ఐదు నియోజకవర్గాలను అభివృద్ధి చేయమంటే స్వార్థంతో ఎమ్మెల్యే కావాలని మరో గూడు చూసుకుంటున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యకు రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఓడిపోయిన వ్యక్తిని జెడ్పీ పీఠం మీద కూర్చోబెడితే సొంత పార్టీకే చిచ్చు పెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాడూ నియోజకవర్గంలో తిరగనటువంటి, కరోనా కాలంలో ప్రజలు పిట్టల్లా రాలిపోతుంటే పట్టించుకోని వ్యక్తి నేడు పరామర్శల పేరుతో వస్తున్నాడని ఎద్దేవా చేశారు. నేను తప్ప ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులందరికీ గులాబీ పార్టీ బీ ఫాం ఇచ్చి గెలిపించిందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధే శ్వాసగా తాను పని చేస్తున్నానని తెలిపారు. పార్టీ గుర్తు మీద గెలువకపోయినా ప్రాంత ప్రజల కోసం తాను పాటు పడుతున్నానని పేర్కొన్నారు. జిల్లాలో ఏకైక మహిళా ఎమ్మెల్యేగా ఉన్న తానంటే గిట్టక ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నడుం బిగిస్తే మహిళా శక్తి విలువ తెలుస్తుందని హితవు పలికారు. నిన్న సీఎం సభకు వేల సంఖ్యలో ప్రజలు తరలివెళ్లి విజయవంతం చేశారని అన్నారు. కలుపుకుని పోదామని చూస్తుంటే కుక్క తోక వంకర చందంగా ఉన్న వారి తీరుతో.. వారి మనసులో ఉన్న విషం తేటతెల్లమైందని పేర్కొన్నారు.

50 ఏళ్లుగా రాని బస్ డిపోను సాధించాం..

బీఆర్‌ఎస్‌ను వదిలిపెడితే.. ఆ తర్వాత బాధ ఏంటో అర్థమవుతుందని అన్నారు. 50 ఏళ్లుగా సాధించలేని బస్ డిపోను, ఏళ్ల తరబడి రాని రోడ్డును కూడా ఈనాడు సాధించామని అన్నారు. దేశంలోనే ఇల్లెందు మున్సిపాలిటీకి 18వ స్థానం దక్కిందని గుర్తుచేశారు. ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ రోజు 800 ఓపీ నమోదవుతుంటే అది సీఎం కేసీఆర్ చలువేనని అన్నారు. ఆసరా పింఛన్ పథకం, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. పంచాయతీలకు రూ.పది లక్షలు, మున్సిపాలిటీకి రూ.పాతిక లక్షలు ఇచ్చారని గుర్తు చేశారు. తడి, పొడి చెత్త వేర్వేరు చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్న పాలక వర్గానికి అండగా నిలుద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతుబంధు జిల్లా సభ్యులు పులిగళ్ల మాధవరావు, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వర రావు, కౌన్సిలర్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలస్యంగా ప్రారంభం..

మున్సిపల్ పాలక వర్గం మూడేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణ ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం సోమవారం బీట్ మార్కెట్ ఆవరణలో నిర్వహించారు. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ ఒంటి గంట వరకు ప్రారంభం కాలేదు. తొలుత కుర్చీలు ఖాళీగా ఉండటంతో నిర్వాహకులు ఆందోళన చెందారు. పట్టణం నుంచి ఆశించినంత మంది హాజరు కాలేదు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి నేతలు, కార్యకర్తలు తరలి రావటం, వారి రాక ఆలస్యం కావటంతో సభ కూడా ఆలస్యంగా ప్రారంభమైంది.

'డబుల్ ఇంజన్'తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ



రామయ్య సేవలో కేంద్ర మంత్రి తదితరులు

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుంది
- కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

ఇల్లెందు/భద్రాచలంటౌన్: డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి సాధ్యమని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుస్తుందని కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ, సహకారశాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన జిల్లాలో పర్యటించారు. భద్రాచలం, ఇల్లెందు పట్టణాల్లో నిర్వహించిన పార్టీ లోక్ సభ ప్రవాస్ యోజన, నూతన ఓటర్ల సమ్మేళనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భద్రాచలంలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం సుభాష్ నగర్ కాలనీలో గోదావరి ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తొలుత శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే బీజేపీకి మంచి పేరు వస్తుందనే అక్కసుతో.. ఆ పథకాలను సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేయడం లేదని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రావడానికి నూతన ఓటర్లు కృషి చేయాలని కోరారు. 2014కు ముందు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రధాని మన్మోహన్ సింగ్ అయినప్పటికీ ప్రభుత్వం సోనియా గాంధీ చేతిలో రిమోట్‌లా ఉండేదని అన్నారు. అందుకే ఆ సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. కోవిడ్ కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ లేకుంటే కోట్ల మంది మృతి చెందే వారని అన్నారు. ఫసల్ బీమా యోజన, ఆయుష్మాన్ భారత్ పథకాలను ఇక్కడ అమలు చేయకుండా సీఎం అడ్డుకున్నారని, ఫార్మా కంపెనీలు, ఆస్పత్రులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో భూ, లిక్కర్ మాఫియా సాగుతోందన్నారు. తెలంగాణలో కుటుంబ, అవినీతి పాలన సాగుతోందని విమర్శించారు. టీఆర్‌ఎస్ పేరు బీఆర్‌ఎస్‌గా మార్చుకున్నంత మాత్రాన అది జాతీయ పార్టీగా మారదన్నారు. భద్రాచలం రామాలయం అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని కేంద్రం చెబితే డీపీఆర్ ఇవ్వలేదన్నారు. కేంద్రం తెచ్చిన సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. రూ.100 కోట్లు, రూ.1000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ రాముడినే మోసం చేశాడని విమర్శించారు. భద్రాద్రి అభివృద్ధికి కేంద్రం ప్రసాద్ పథకంలో భాగంగా రూ.వెయ్యి కోట్లు ప్రకటించి అందులో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చట్టామని తెలిపారు. ఈ సభలో జిల్లా ఇన్‌చార్జ్ రాకేష్‌రెడ్డి, రాజ్యవర్ధన్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, నాయకులు కుంజా సత్యవతి, రాంచంద్రారావు, సీతయ్య, రాజు బెహ్రా, త్రినాథ్‌రావు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, హుస్సేన్ నాయక్, ముసుగు శ్రీనివాస్‌రెడ్డి, ఊకె అబ్బయ్య, నాళ్ల సోమసుందర్, బలగాని గోపీకృష్ణ, జి. రాంచందర్‌నాయక్, మావునూరి మాధవ్, రామయ్య, విమల్ జైను, శ్రీను, ఎడ్లపెల్లి శ్రీనివాస్, వేప సీతయ్య, రామచంద్రయ్య, మిర్యాల వెంకన్న, నాగన్న, హతీరాం నాయక్, రుద్రయ్య, మురళీ కృష్ణ, రాహుల్, రజత్, సుచిత్ర పాసీ, జమునారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సరెండర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముత్యంను సరెండర్ చేసినట్లు కలెక్టర్ అనుదీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్యం స్థానంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తగూడెంటౌన్: మెదక్‌లో ఇటీవల జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కొత్తగూడేనికి చెందిన క్రీడాకారులు పతకాలు సాధించడమే కాక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన క్రీడాకారుడు సీహెచ్.నాగయ్య, బి.కృష్ణయ్య, పి.మోహన్ తదితరులు పతకాలు సాధించడంతో పాటు హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సీపీఐ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు సాంబశివరావు, సాబీర్‌పాషా తదితరులు అభినందించారు.

'గణతంత్ర' ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టర్ అనుదీప్



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గణతంత్ర వేడుకల ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం గణతంత్ర వేడుకలు, ధరణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రగతి మైదానాన్ని పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఏర్పాట్లను పర్యవేక్షించాలని కొత్తగూడెం ఆర్డీఓకు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓకు సూచించారు. ధరణి ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలను ఆదేశించారు.

ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తులు ఇలా..

- అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి పంచాయతీ పాపిడి గూడెం గ్రామప్రజలు స్థానికత సమస్యపై ఫిర్యాదు చేయగా, కలెక్టరేట్ ఓఎస్‌డీకి ఎండార్స్ చేశారు.
- తనకు డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని మణుగూరు మండలం రాజుపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు గాండ్ల స్వర్ణ విన్నవించగా, డీఆర్‌ఓకు ఎండార్స్ చేశారు.
- సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు కరకట్ట నిర్మాణంలో దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి గ్రామం పోతుందని గ్రామాన్ని ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని, తమకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీతో పాటు, రూ 10లక్షలు నష్టపరిహారం, ఇంటిస్థలాలు కేటాయించాలని గ్రామస్తులు విన్నవించారు. దీంతో దరఖాస్తును దుమ్ముగూడెం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

పకడ్బందీ ప్రణాళికలు తయారుచేయాలి

ఆరోగ్యకరమైన ప్రణాళికలు తయారుచేసి అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల, జిల్లాస్థాయి ప్రణాళికలు తయారీ కోసం ప్రజాప్రతినిధులు, లైన్ డిపార్టుమెంట్లతో ప్రణాళికల కమిటీ వేయాలన్నారు. మొదటి, రెండో, మూడో కమిటీ సభ్యుల ఆమోదం మేరకు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఈసమావేశంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్, వైద్యాధికారి శిరీష, జిల్లా సంక్షేమాధికారి లెనినా పాల్గొన్నారు.

ఎన్నికల పరికరాల పరిశీలన

కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు పంపిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లకు యూజర్ యాక్సెప్టెన్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ తెలిపారు. సోమవారం ఈవీఎం గోదాంలో భద్రపర్చిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల పనితీరును పరిశీలించేందుకు ఈసీఐఎల్ కంపెనీ నుంచి ఇంజనీరు రాజశేషు జిల్లాకు వచ్చారని చెప్పారు. జిల్లాకు వచ్చిన 1976 పరికరాలను రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో నిశిత పరిశీలన చేస్తున్నామని తెలిపారు. మరమ్మతులు ఉంటే తిరిగి ఎన్నికల సంఘానికి పంపిస్తామని తెలిపారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ఎంఎ రాజు, సిబ్బంది నవీన్, భూక్య రమేష్(సీపీఎం), షేక్ అన్వర్(బీఆర్‌ఎస్), బొల్లోజు మోహనాచారి(టీడీపీ), ఝుగ్రా కామేష్(బీఎస్పీ), లక్ష్మణ్ అగర్వాల్(బీజేపీ) పాల్గొన్నారు.

పదోన్నతులతో మరింత బాధ్యత



ఎస్సైలను అభినందిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. ఏఎస్సై నుంచి ఎస్సైలుగా పదోన్నతి పొందిన 1984 బ్యాచ్‌కు చెందిన వారు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి పొందిన ఏడుగురు ఎస్ఐలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

క్లుప్తంగా

జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా, పక్కన సంస్థ రీజినల్ మేనేజర్ రాబిన్ తంపీ తదితరులు

చుంచుపల్లి: కొత్తగూడెంలోని కమ్మ సేవా సత్రంలో వరల్డ్ ఫేవరేట్ జోయాలుక్కాస్ జ్యూయలరి ఎగ్జిబిషన్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. జ్యూయలరి విభాగంలో మన్నికకు మారుపేరుగా నిలిచేది ఒక్క జోయాలుక్కాస్ మాత్రమేనన్నారు. ఆ సంస్థ యజమానులు కొత్తగూడెంలో మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం జోయాలుక్కాస్ తెలంగాణ రీజినల్ మేనేజర్ రాబిన్ తంపీ మాట్లాడుతూ ఈ నెల 25 వరకు ఈ జ్యూయలరి ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదావత్ శాంతి, భూక్యా రాంబాబు, జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై కేసు

పినపాక: ఎలాంటి అనుమతులు లేకుండా ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విద్యార్థినులను బయటకు తీసుకువెళ్లిన ఘటనపై ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వీరభద్రం, శైలజపై ఈ–బయ్యారం పోలీస్ స్టేషన్లో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఎలాంటి అనుమతులు లేకుండా ఆశ్రమ పాఠశాల హాస్టల్‌కి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి సమస్యల పరిష్కారమని చెప్పి పాదయాత్రగా బయటకు తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న సిబ్బంది, విద్యాశాఖ అధికారులు బయటకు వెళ్లిన విద్యార్థినులను హాస్టళ్లకు తీసుకొచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులే బలవంతంగా బయటికి తీసుకెళ్లారని విద్యార్థులు తెలపడంతో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాబూరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ టీవీఆర్ సూరి తెలిపారు.

కేటీపీఎస్‌లో టిప్పర్‌ను ఢీకొట్టిన మరో టిప్పర్



నుజ్జునుజ్జయిన టిప్పర్ ముందు భాగం

టేకులపల్లి/సింగరేణి(కొత్తగూడెం): టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్టులో ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారుజామున బొగ్గును తరలిస్తున్న ఓ టిప్పర్ (లారీ) ఆగి ఉన్న మరో టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో టిప్పర్‌ను నడుపుతున్న మండలంలోని తొమ్మిదోమైలుతండా వాసి బానోతు శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా మంచు కురుస్తుండటమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. గాయపడిన డ్రైవర్‌ను కొత్తగూడెం సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, గాయపడిన శంకర్‌కు మెరుగైన వైద్యం అందించడమే కాక, మస్టర్‌తో కూడిన వేతనం చెల్లించాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాకుల ప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇక కొత్తగూడెం ఆస్పత్రిలో బానోత్ శంకర్‌ను ఇఫ్టూ నాయకులు పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నాయకులు కందగట్ల సురేందర్, గౌని నాగేశ్వరరావు, మోత్కూరి మల్లికార్జున్, కల్తి శంకర్, రాయండ్ల కోటిలింగం, సంతు, భద్రు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



సురేశ్ (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన మందనపు సురేశ్ (35) అప్పులబాధ తాళలేక ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఎస్‌ఐ పోటు గణేశ్ కథనం ప్రకారం.. సురేశ్ తన కుటుంబ అవసరాల నిమిత్తం జువాది నర్సింహారావు, అన్నపురెడ్డి జగ్గయ్య, బత్తుల రాము, మరికొందరి వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు తీర్చాలని సురేశ్‌పై ఒత్తిడి తెస్తుండటంతో కొన్ని రోజులుగా అతను మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం కాకర్ల గ్రామ సమీపంలో గల మామిడితోటలో సురేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సురేశ్ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గణేశ్ వివరించారు. కాగా, సురేశ్ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

గోపన్నపై నిర్లక్ష్యమేలా!





రంగులు కూడా వేయని రామదాసు ధ్యాన మందిరం (ఇన్‌సెట్) మందిరంలో ఉత్సవమూర్తులు

- రామదాసు మందిరాన్ని దత్తత తీసుకున్న భద్రాద్రి ఆలయం
- అయినా అభివృద్ధి అంతంతే..
- జయంతోత్సవాలకు మొక్కుబడిగా ఏర్పాట్లు
- తాగునీటి సౌకర్యం కూడా లేక సందర్శకుల విలవిల

నేలకొండపల్లి: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం నిర్మాత, పరమ భక్తాగ్రేసరుడు, వాగ్గేయకారుడైన భక్త రామదాసు(కంచర్ల గోపన్న) మందిరం నిరాదరణకు గురవుతోంది. ప్రస్తుత ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన కంచర్ల లింగనమంత్రి – కామాంబ కుమారుడు కంచర్ల గోపన్న తన మేనమేమల ప్రోత్సాహంతో గోల్కొండ నవాబుల హయాంలో ప్రస్తుతం భద్రాచలం ఉన్న పాల్వంచ పరగణం తహసీల్దార్‌గా పనిచేయడం.. 1655లో రాముడు కలలోకి వచ్చాడని నమ్మి ఆలయాన్ని నిర్మించడం.. దీంతో ప్రజల సొమ్మును కాజేశారని గోల్కొండ తానీషా గోపన్నను జైలులో పెట్టాడని భక్తులు నమ్మిక. ఆతర్వాత రామలక్ష్మణులు తానీషాకు చేసిన సూచనలతో రామదాసును చెరసాల నుంచి విడుదల చేయగా.. ఆయన భక్తాగ్రేసరుడిగా పేరొందాడని చెబుతారు. కాగా, గోపన్న పదో తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు కొత్తగూడెంలో నివాసముంటుండగా.. ఆయన స్వస్థలంలో ఉన్న ధ్యానమందిరం నిరాదరణకు గురవుతుండడంతో స్థానికులకు కలిచివేస్తోంది. ఏటా గోపన్న జయంతోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ తూతూ మంత్రంగా చేసే ఏర్పాట్లతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లు.. బావి

నేలకొండపల్లిలోని రామదాసు నివసించిన ఇంటిని ఆధునికీకరించి ధ్యాన మందిరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ ఆయన వాడిన బావిని కూడా చూడొచ్చు. కొన్నేళ్ల క్రితం ధ్యానమందిరాన్ని భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకున్నప్పటికీ నిధులు విదల్చటం లేదు. కనీసం జయంతోత్సవాలకు కూడా పెద్దగా నిధులు కేటాయించడం లేదనే చెప్పాలి. ధ్యాన మందిరంలో అపరిశుభ్రత రాజ్యమేలుతున్నా, ప్రహరీ కూలి రెండేళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇక్కడ సందర్శనకు వచ్చే వారికి కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మరోపక్క మందిరంలో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులు ఏళ్ల తరబడి సాగుతుండడం గమనార్హం. ఇవేకాక రామదాసు పదో తరం వారసులను గుర్తించకున్నా వారు ఏటా జయంతోత్సవాలకు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

మొక్కుబడిగానే ఉత్సవాలు

ఈనెల 25 నుంచి నిర్వహించనున్న భక్త రామదాసు జయంతోత్సవాలను భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా పాలనా యంత్రాంగం, భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం, శ్రీ భక్తరామదాసు విద్వత్ కళాపీఠం ఆధ్వర్యాన నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే, కార్యక్రమానికి ఇంకా రెండు రోజులే సమయమున్నా మందిరానికి ఇప్పటికీ రంగులు వేయలేదు. ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగించి, కూలిన ప్రహరీని పునర్నిర్మిస్తే కాస్త అందంగా కనిపించేది. కానీ భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకున్నా అలాంటివేమీ జరకపోగా, కనీసం ఉత్సవాల నిర్వహణపై ప్రచారం కూడా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆలయం ఆధ్వర్యానే నిర్వహించాలి



రామదాసు ధ్యానమందిరాన్ని భద్రాచలం దేవస్థాన పూర్తి స్థాయిలో దత్తత తీసుకోవాలి. భద్రాచలం ఆలయ కమిటీలో నేలకొండపల్లి నుంచి శాశ్వత సభ్యుడికి స్థానం కల్పించాలి. అంతేకాక రామదాసు జయంతోత్సవాల నిర్వహణకు ఖర్చు పూర్తిగా ఆలయమే భరించి.. పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని కూడా నియమించాలి.

– రాయపూడి నవీన్, సర్పంచ్, నేలకొండపల్లి

కమిటీని ఎప్పుడు ఎన్నుకున్నారు?



రామదాసు జయంతి ఉత్సవాలను ప్రభుత్వ శాఖలే నిర్వహించాలి. మందిరాన్ని భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకున్నా, విద్వత్ కళాపీఠం వారి ఆధ్వర్యంలో నిర్వహించటం ఏమిటో అర్థం కావటం లేదు. ఈ కమిటీని ఎప్పుడు ఎన్నుకున్నారు, విధివిధానాలు ఏమిటో బహిర్గతం చేయాలి.

– పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి

దేవస్థానం ఆధ్వర్యంలోనే నిర్వహిస్తాం..



రామదాసు ధ్యాన మందిరంలో ఉత్సవాలను భద్రాద్రి దేవస్థానమే నిర్వహిస్తుంది. ఆలయ అర్చకుల వేతనాలు, పూజా సామాగ్రి, వస్త్రాలు ఇతరత్రా సౌకర్యాలను సమకూరుస్తాం. విద్వత్ కళాపీఠం కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తున్నాం. అలాగే, ఆడిటోరియం పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించాం.

– బి.శివాజీ, భద్రాద్రి దేవస్థానం ఈఓ, భద్రాచలం

తండాల్లో సమస్యలపై సర్వే నిర్వహిస్తాం

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మ



మాట్లాడుతున్న ధర్మ

చంద్రుగొండ: గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోతు ధర్మ తెలిపారు. సోమవారం నిర్వహించిన మండలశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర లేక, వంట గ్యాస్, పెట్రోల్ ధరలు పెరగడంతో తండాల్లోని గిరిజనులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే సంఘం జాతీయ మహాసభలు కోల్‌కతాలో, రాష్ట్ర మహాసభలు మిర్యాలగూడెంలో, జిల్లా మహాసభలు సుజాతనగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు బాణోత్ నాగేశ్వరరావు, భూక్య హర్ష, అజ్మీర రమేశ్, వెంకన్న, భద్రు, బాలు పాల్గొన్నారు.

త్రీఇంక్లయిన్ కేవీకేలో చోరీ

కొత్తగూడెంటౌన్: త్రీఇంక్లయిన్ పంచాయతీ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం రూ.40 వేల విలువైన ఇనుమును గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఉన్న రూ.40వేల విలువైన ఇనుము చోరీకి గురైందని గుర్తించిన విజ్ఞాన కేంద్రం బాధ్యులు రాయల శ్రీ నివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు...

అశ్వాపురం: మండలంలోని మొండికుంటలో సోమవారం రాత్రి మహిళ మెడలో బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన తునికేసి లక్ష్మి గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి నడుచుకుంటూ వస్తుండగా బైక్ మీద వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని పుస్తెలతాడును లాక్కొని వెళ్లారు. ఎస్‌ఐలు నాగుల్‌మీరా, జితేందర్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పోలీసుల వేధింపులే కారణమని కుటుంబీకుల ఆరోపణ



హచ్చు (ఫైల్)



ఎస్‌ఐని నిలదీస్తున్న మృతుడి కుటుంబీకులు

టేకులపల్లి: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే, ఆయన మృతికి పోలీసుల వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మద్రాస్‌తండాకు చెందిన బాదావత్ హచ్చు (45) కుమారుడు ఇంటర్ చదువుతుండగా, అదే కాలేజీలో చదివే బాలికతో ప్రేమపేరుతో వెంటపడ్డాడు. ఆ బాలికను తీసుకుని హచ్చు కుమారుడు వెళ్లిపోగా, ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఈ నెల 13న పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత 16న బాలికను తీసుకొచ్చి అప్పగించాక విద్యార్థిపై పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన హచ్చు సోమవారం పురుగులమందు తాగగా, కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండడంతో మృతి చెందాడు. కాగా, పోలీసుల వేధింపుల కారణంగానే హచ్చు ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. హచ్చు కుమారుడితో పాటు ఇతర బంధువులను పోలీసులు విచారణ పేరిట నిర్బంధించడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రామగుండం డీజీఎం మృతి



నీలం శ్రీనివాస్ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): రామగుండం ఏరియాలో డీజీఎంగా విధులు నిర్వర్తిస్తున్న నీలం శ్రీనివాస్ (60) సోమవారం అనారోగ్యంతో గోదావరిఖనిలో మృతి చెందారు. శ్రీనివాస్ ఇటీవలే డిప్యూటీ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తెలిద్దరూ అమెరికాలో వైద్యులుగా కొనసాగుతున్నారు. శ్రీనివాస్ మృతితో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం నెహ్రూబస్తీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటోను ఢీకొట్టిన లారీ



ఘటనాస్థలంలో ఆటో, లారీ

కామేపల్లి(కారేపల్లి): ఆటోను లారీ ఢీకొట్టగా, ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం తాళ్లగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు డి. లీలావినోద, మోహన్‌రావు తదితరులు సోమవారం సాయంత్రం ఆటోలో ఖమ్మం బయలుదేరారు. ఈక్రమంలో మర్రిగూడెం సమీపాన వీరు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఘటనలో ఆటోడ్రైవర్‌తో పాటు, లీలవినోద, మోహన్‌రావుకు స్వల్ప గాయాలు కాగా లారీ డ్రైవర్ పరారయ్యాడు. దీంతో క్షతగాత్రలను స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఎస్సీ యువతను ఆదుకోండి

- స్వయం ఉపాధి లేక ఇబ్బందులు
- సబ్సిడీ నిధులు కూడా విడుదల చేయని ప్రభుత్వం

కొత్తగూడెంరూరల్: ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కల్పించి, వారిని వృద్ధిలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఆచరణలో మాత్రం అది అమలు కావడం లేదు. జిల్లాలో రెండు దఫాలుగా స్వయం ఉపాధి (ఎస్సీ యాక్షన్ ప్లాన్)కి నోటిఫికేషన్ రాలేదు. దీంతో ఎస్సీ యువతీ, యువకులు నోటిఫికేషన్ రాక, ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 2020–21లో ఎస్సీ యాక్షన్ ప్లాన్ నోటిఫికేషన్ వచ్చింది. అందులో రుణాల కోసం కొందరు దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలు నిర్వహించి 320 యూనిట్లు మంజూరు చేశారు. అందుకుగాను రూ.5,86,28,000 సబ్సిడీ ఇచ్చారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం నుంచి సబ్సిడీని విడుదల చేయాలని ఆన్‌లైన్ ద్వారా హైదరాబాద్‌కు పంపించారు. రాష్ట్ర ఖజానాలో చెక్కులు రెడీ చేసి ఉన్నప్పటికీ నిధులు విడుదల చేయలేదు.. దీంతో రుణాలు మంజూరైన లబ్ధిదారులు తమకు ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడుస్తున్నా సబ్సిడీ నిధులు ప్రభుత్వం విడదుల చేయకపోవడం వల్ల లబ్ధిదారులు ఎస్సీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదిలాఉండగా 2021–22, 2022–23 సంవత్సరాల్లో ఎస్సీ యాక్షన్ ప్లాన్ నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేయలేదు. ఏటా నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో ఎస్సీ యాక్షన్ ప్లాన్ నోటిఫికేషన్ ఇస్తారు. ఈ ఏడాది మార్చిలోపు అయినా నోటిఫికేషన్ వస్తుందా? రాదా? వేచి చూడాల్సిందే.. కాగా, ఈ సమస్యపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావును వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ వస్తే స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గురుకులం గోడదూకి పారిపోయిన విద్యార్థిని

పాల్వంచరూరల్: పదో తరగతి విద్యార్థిని అర్ధరాత్రి గురుకుల కళాశాల ప్రహరీ దూకి పారిపోయింది. పాల్వంచలోని ఇందిరానగర్‌కాలనీ, జీసీసీ కార్యాలయం పక్కన భద్రాచలం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో కరకగూడెం మండలం రేగళ్లకు చెందిన సీహెచ్ శ్రీవిద్య పదో తరగతి చదువుతోంది. స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి నిద్రించిన ఆమె సోమవారం తెల్ల వారుజామున 3.15 గంటలకు ప్రహరీ వద్ద కుర్చీ వేసుకుని గోడపైకి ఎక్కి పారిపోయింది. తెల్ల వారాక శ్రీవిద్య లేకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేక సీసీ కెమెరాల పుటేజీ చూడడంతో ఈ విషయం వెల్లడైంది. దీంతో ఆమె తల్లిదండ్రులకు తెలియచేశామని ప్రిన్సిపాల్ స్వరూపారాణి తెలిపారు. కాగా, రాత్రివేళ రక్షణ కోసం ఇద్దరు టీచర్లు, మహిళా వాచ్‌మెన్ ఉన్నా విద్యార్థిని హాస్టల్ నుంచి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఘటనపై ప్రిన్సిపాల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించారు. చదువుపై ఆసక్తి లేకపోవడం వల్లనే పారిపోయినట్లు విద్యార్థిని లేఖ రాసి బ్యాగులో పెట్టినట్లు సమాచారం.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

పాల్వంచ: విద్యార్థిని వెంట బెట్టుకుని కల్లు దుకాణానికి వెళ్లిన ఉపాధ్యాయుడిని విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మున్సిపాలిటీ పరిధిలోని పేటచెరువు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వెంకటరమణ ఈ నెల 21వ తేదీన 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని తన మోటర్ సైకిల్‌పై ఎక్కించుకుని పిల్లవాగు గ్రామంలోని కల్లు దుకాణానికి వెళ్లాడు. ఈ విషయంపై అక్కడి స్థానికులు, విద్యార్థి బంధువులతో ఘర్షణ జరిగింది. ఘటనపై ఎంఈఓ శ్రీరాంమూర్తి ఆధ్వర్యంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం, సీఆర్‌పీలు విచారణ చేసి డీఈఓకు నివేదిక సమర్పించారు. నివేదిక ఆధారంగా డీఈఓ సోమశేఖరశర్మ సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

58 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులను చూపుతున్న పోలీసులు

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని స్థానిక పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టణ సీఐ నాగరాజురెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా బ్యాగులో 58 కేజీల గంజాయిని పోలీసులు గుర్తించారు. పట్టుబడినవారు టేకులపల్లి మండలంలోని మూడుతండాకు చెందిన కనగాల సుమన్, సింగయ్యతండాకు చెందిన భూక్యా సిద్ధుగా గుర్తించారు. వారు ఒడిశా రాష్ట్రంలోని కలిమెలాకు చెందిన ఇంద్ర అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి.. నల్లగొండ జిల్లాలోని జల్మల కుంటతండాకు చెందిన లావూరు సంతోష్‌కు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు సీఐ వివరించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.11.60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ మధుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.